సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



చదువుకుందాం... రారండి


పేద, అనాథ బాలికల విద్యకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) భరోసాగా నిలుస్తున్నాయి. కేజీబీవీల్లో ప్రవేశాలకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. - 8లో▸



అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన గునిశెట్టి శ్రీనివాస్ సుదర్శన్ సోమవారం 1,01,116 విరాళం అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2185, మధ్య డెల్టాకు 1000, పశ్చిమ డెల్టాకు 3800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 5.60 అడుగులకు నీటి మట్టం చేరింది.

రంజాన్ వేళలు

రాజమహేంద్రవరం

ఇఫ్తార్	-	సెహరీ
మంగళవారం (సా)		బుధవారం (ఉ)
6:26	-	4:28

ఇంటింటికీ గోదావరి జలాలు

- వాటర్ గ్రిడ్ నిర్మాణానికి శరవేగంగా సర్వే
- ఓహెచ్‌బీఆర్, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు
- జేగురుపాడు, లేకుంటే మడికి వద్ద స్థలాల అన్వేషణ
- డెల్టా వాసులకు తీరనున్న తాగునీటి అవసరాలు



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద ఇన్‌లెట్ కట్టే ప్రాంతంలో లెవిల్స్ తీస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

సాక్షి అమలాపురం: గోదావరి నీటిని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి డెల్టా వాసుల ఇళ్లకు నేరుగా తరలించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి సర్వే పనులు వేగం అందుకున్నాయి. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే దాదాపు పూర్తి కావస్తుంది. ఫిల్టర్ బెడ్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణాలు చేసే ప్రాంతాలను గుర్తించేందుకు చేపట్టిన ఈ సర్వే 80 శాతం పూర్తయ్యింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని గోదావరి డెల్టా విస్తరించిన ప్రాంత వాసులకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నేరుగా తాగునీరు సరఫరా చేయాలని దశాబ్దాల కాలంగా ప్రజలు కోరుతున్నారు.

ఆచరణ సాధ్యం..

గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయేగాని ఆచరణలోకి తీసుకు రాలేకపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపింది. చిత్తశుద్ధితో అడుగులేస్తోంది. ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేసింది. 'డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ఇన్ కోస్టల్ ఏరియా' అనే పథకంలో ఈ బృహత్తర ప్రాజెక్టుకు ఇప్పటికే శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రూ.1,650 కోట్ల ప్రాజెక్టు టెండర్‌ను మెగా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 11 నియోజకవర్గాలు 32 మండలాల్లోని 451 గ్రామాలకు తాగునీరందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సుమారు 25 లక్షల మందికి నేరుగా గోదావరి నుంచి తాగునీరు అందించనుంది. తద్వారా పంట కాలువల్లో కాలుష్య నీటికి కొంత వరకు చెక్ పడనుంది.





ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం వద్ద జరుగుతున్న సర్వే

నిర్మాణం ఇలా..

బృహత్తర ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించే ముందు చేపట్టిన సర్వే దాదాపు 80 శాతం పూర్తయ్యింది. ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ (ఆర్‌ఎస్‌ఎఫ్)లను ఒక్కొక్క దానిని 30 నుంచి 50 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పెర్ డే) సామర్థ్యంతో నిర్మిస్తారు. ఇక్కడ నీటిని అధునాతన పద్ధతిలో ఫిల్టర్ చేసి అక్కడ నుంచి ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ (ఓహెచ్‌ఎస్‌ఆర్), ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఓహెచ్‌బీఆర్)లకు పంపిస్తారు. వీటి నిర్మాణాలకు అవసరమైన భూమిని గుర్తిస్తున్నారు. మధ్య డెల్టాకు సంబంధించి ఆత్రేయపురం మండలం వద్దిపర్రు వద్ద 12 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇటీవల కొత్తపేట ఆర్డీవో ముక్కంటి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించారు. మిగిలిన భూమి స్థానికంగా లభ్యం కాకపోతే వెలిచేరులో మిగిలిన ఆరు ఎకరాలు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జేగురుపాడులో స్థల సేకరణ యోచన

తూర్పు డెల్టాకు సంబంధించి ఫిల్టర్ బెడ్ల నిర్మాణానికి కడియం మండలం జేగురుపాడులో స్థలాన్ని సేకరించాలని భావిస్తున్నారు. ఇక్కడ మొత్తం స్థలం లభించకుంటే కోనసీమ జిల్లా పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గ గ్రామాలకు మడికి వద్ద ఫిల్టర్ బెడ్ రూమ్ స్థలాన్ని సేకరించాలని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మధ్య డెల్టాకు ఇటు బొబ్బర్లంక ఒక ఇన్‌లెట్ వద్ద తూర్పు డెల్టాకు ధవళేశ్వరం వద్ద మూడు ఇన్ లెట్లు నిర్మాణం చేయనున్నారు. వీటి నిర్మాణానికి కూడా సర్వే పూర్తి చేశారు.

పాత పథకాలకు అనుసంధానం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డెల్టా పరిధిలో ఉన్న 31 సీడబ్ల్యూసీ, 390 పీడబ్ల్యూసీ స్కీమ్‌ల ద్వారా తాగునీరు అందుతోంది. జల్ జీవన్ మిషన్‌లో నిర్మాణాలను సైతం పరిశీలించారు. పాత ప్రాజెక్టులకు అనుసంధానంగా కొత్త నిర్మాణం జరగనుంది. ఇప్పటికే జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికి పైప్‌లైన్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయా మండలాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు వాటి సామర్థ్యం పరిశీలించి అవసరమైన చోట కొత్త ట్యాంకుల నిర్మాణాలు చేయనున్నారు. సర్వేలో వాటిని కూడా గుర్తించారు. పాత పైప్‌లైన్లకు కొత్త పైప్‌లైన్లను ఎక్కడెక్కడ ఎంతమేర అనుసంధానం చేయాలనే దానిని కూడా గుర్తించి పూర్తి ప్రణాళికను సిద్ధం చేశారు. అన్ని అనుకున్నట్టు జరిగితే నెల రోజులలో ఈ ప్రాజెక్టు పనులకు అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.

ఎవరెవరికీ జలాలు అంటే..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మధ్య డెల్టాలోకి వచ్చే అమలాపురం, కొత్తపేట రెవెన్యూ డివిజన్లలో అన్ని గ్రామాలతో పాటు, తూర్పు డెల్టా పరిధిలోని రామచంద్రపురం డివిజన్‌లో గ్రామాలు ఈ ప్రాజెక్టు పరిధిలో ఉంటున్నాయి. కాకినాడ జిల్లా (తూర్పు డెల్టా పరిధిలో) సామర్లకోట, కరప, తాళ్లరేవు, కాజులూరు మండలాలు, తూర్పు గోదావరి జిల్లా పరిధిలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల గ్రామాలలోని ఇళ్లకు నేరుగా గోదావరి జలాలు అందించనున్నారు.

స్థలాలను గుర్తిస్తున్నాం



ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నేరుగా తాగునీరు అందించే ప్రాజెక్టు సంబంధించి అవసరమైన నిర్మాణాలకు స్థలాలను గుర్తిస్తున్నాం. వద్దిపర్రు, జేగురుపాడు, మడికిలో వాటర్ ఫిల్టర్‌కు స్థలాలు అనువుగా గుర్తించాం. సర్వే దాదాపు పూర్తి కావస్తోంది. త్వరలోనే పనులకు శంకుస్థాపన జరుగుతోంది.

సీహెచ్‌ఎస్‌వీ కృష్ణారెడ్డి,
గ్రామీణ నీటిసరఫరా శాఖ జిల్లా అధికారి

రియల్ ఎస్టేట్‌కు స్వర్గధామం ఏపీ

- రాష్ట్రంలో విస్తృతంగా గృహ నిర్మాణాలు
- క్రిడాయ్ పాలకవర్గ సభ్యుల మనోగతం

సాక్షి, రాజమహేంద్రవరం: రియల్ ఎస్టేట్ రంగానికి ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా విరాజిల్లుతోందని క్రిడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని హోటల్ మంజీరలో క్రిడాయ్ కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ హైదరాబాద్‌లో ఎక్కువగా విస్తరిస్తోంది, అక్కడ నిర్మాణాలకు మంచి డిమాండ్ ఉందన్న వాదనలు అపోహ మాత్రమేనన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కంటే ఆంధ్రాలో నిర్మాణ రంగం వేగం పుంజుకుందన్నారు. రాజమండ్రి నగరంలోనే నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ నుంచి బిల్డర్లు క్యూ కడుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం సైతం సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్న ధ్యేయంతో నాణ్యమైన గృహ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా క్రిడాయ్ అసోసియేషన్‌లోని బిల్డర్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో క్రిడాయ్ నేషనల్ జాయింట్ సెక్రటరీ రాజా శ్రీనివాస్, ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ప్రెసిడెంట్ వెవీ రమణారావ్, జనరల్ సెక్రటరీ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొత్తగా ఏర్పాటైన క్రిడాయ్ పాలకవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

క్రిడాయ్ తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ చైర్మన్‌గా బూడిగ శ్రీనివాసు, చైర్మన్ సురవరపు శ్రీనివాస్ కుమార్, ప్రెసిడెంట్‌గా మన్యం సంతోష్ ఫణికుమార్, వైస్ ప్రెసిడెంట్‌లుగా రెడ్డి రామకృష్ణ, మట్టపల్లి రంగ ప్రసాద్, పూడి వెంకట శ్రీనివాసరావ్, జనరల్ సెక్రటరీ చల్లా బాలమురళి కృష్ణా, ట్రెజరర్‌గా టీవీఎస్.నరసింహారావ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అన్ని వర్గాలకూ రుణాల మంజూరు

ఇండియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ కెఎస్.సుధాకరరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశంలో ఇండియన్ బ్యాంక్ రూ.10లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించినట్లు ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కెఎస్.సుధాకరరావు తెలిపారు. సోమవారం స్థానిక ఐఎల్‌టీడీ సెంటర్ రైతు బజార్ సమీపంలో బాలాజీపేట బ్రాంచి బ్యాంకును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ తమకు ఉమ్మడి తెలుగురాష్ట్రాలలో 450 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే 350 బ్రాంచిలున్నాయన్నారు. అన్ని వర్గాలకూ తమ బ్యాంకు రుణాలు అందిస్తోందన్నారు. రైతులకు, బంగారంపై రుణాలు రుణాలు అందజేస్తున్నామన్నారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకూ రుణాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 15000 ఎస్‌హెచ్‌జీలకు రూ.700కోట్లు రుణాలు అందజేశామన్నారు. రైస్‌మిల్లర్లలకు అతితక్కువ కమీషన్‌తో బ్యాంకు గ్యారంటీ ఇస్తున్నామన్నారు. రొయ్యలు,చేపలు పెంపకం, ప్రోసెసింగ్ యూనిట్లకు, ఫుడ్‌ప్రోసెసింగ్ యూనిట్లకు రుణాలు ఇస్తున్నామన్నారు. డిజిటల్ వ్యాపార లావాదేవీలు బాగా పెరిగాయన్నారు. డోర్‌స్టెప్ బ్యాంకింగ్ వ్యవస్థను తీసుకురావడం వలన ఖాతాదారులు బ్యాంకుకు రాకుండానే సేవలు పొందవచ్చని సీజీఎం వివరించారు. ఇండియన్‌బ్యాంక్ రాజమండ్రి రీజియన్ జోనల్ మేనేజర్ పిఎస్ఎస్ సుధాకరరావు మాట్లాడుతూ త్వరలో దివాన్‌చెరువు రోడ్‌లో కొత్త బ్రాంచిని ప్రారంభించనున్నామన్నారు. బ్రాంచి మేనేజర్ వి.శివాజీ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించడం జరుగుతుందన్నారు. వివిధ బ్రాంచిల అధికారులు, నగరప్రముఖులు,వ్యాపారులు, సిబ్బందిపాల్గొన్నారు.



బాలాజీపేట బ్రాంచిని ప్రారంభిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ కెఎస్.సుధాకరరావు

చినవెంకన్నకు కాసుల గలగల

- స్వామి వార్షిక ఆదాయం రూ.131 కోట్లు
- నిత్యం పెరుగుతున్న భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి (చినవెంకన్న) వార్షిక ఆదాయం రూ. 131 కోట్లకు చేరింది. 2019 తర్వాత రెండేళ్ల పాటు కోవిడ్ కారణంగా శ్రీవారి ఆదాయం గణనీయంగా తగ్గింది. తరువాత 2021-22 ఆర్థిక సంవత్సరంలో ముందెన్నడూ లేనివిధంగా రూ. 128,77,75,411 ఆదాయం లభించింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.131,33,37,913 ఆదాయం సమకూరింది. దేవస్థానం ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులు పోగా 2021-2022 నికర ఆదాయం రూ.57,16,25,467. గతేడాది నికర ఆదాయం రూ. 69,08,86,656గా ఉంది. దీని ప్రకారం 2021-2022 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గడచిన ఆర్థిక సంవత్సరంలో స్వామివారి నికర ఆదాయం రూ.11,92,61,189 పెరిగింది.

అభివృద్ధికి దీటుగా ఆదాయం

శ్రీవారి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్న విధంగానే స్వామివారి ఆదాయం అంతకంతకూ పెరుగుతోంది. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో స్వామివారిని దాదాపు 25 నుంచి 40 వేల మందికి పైగా, సాధారణ రోజుల్లో 5 నుంచి 12 వేల మందికి పైగా భక్తులు దర్శిస్తున్నారు. పెద్ద తిరుపతి వెంకన్న మొక్కులను ఇక్కడ తీర్చుకోవచ్చుననే సంప్రదాయం ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. వీఐపీల తాకిడి కూడా బాగా పెరిగింది. క్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. మరోపక్క అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాతలు కాటేజీల నిర్మాణం, డోనార్‌స్కీమ్, శాశ్వత నిత్యాన్నదానం, గోసంరక్షణ, విమానగోపుర స్వర్ణమయ పథకాలకు, ప్రాణదాన ట్రస్ట్‌కు విరివిగా విరాళాలను అందజేస్తున్నారు.

క్షేత్ర చరిత్ర ఇదీ..

ఈ క్షేత్రాన్ని త్రేతాయుగంలో శ్రీరామచంద్రుని పితామహుడు అజమహారాజు, తండ్రి దశరథ మహారాజు అలాగే స్వయంగా శ్రీరామచంద్రుడు వారివారి కాలాల్లో స్వామివారిని సేవించుకున్నారని పురాణాలు చెబుతున్నాయి. ద్వారకామహర్షి తపోఫలితంగా ఉద్భవించిన ఈ క్షేత్రాన్ని ద్వారకా తిరుమలగా పిలుస్తున్నారు. ఇక్కడ స్వయం వ్యక్తునిగా కొలువు తీరిన చినవెంకన్న పుట్టలో వెలిశారు. స్వామివారి పాదుకలు పుట్టలో ఉండటంతో శ్రీవారికి పాదపూజ లేదు. దాంతో పెద్దతిరుపతి నుంచి పాదపూజ కోసం శ్రీనివాసుని తీసుకొచ్చి స్వయం వ్యక్తుని వెనుక ప్రతిష్టించారు. దీంతో ఇక్కడ ఒకే అంతరాలయంలో స్వామి వారు ద్విమూర్తులుగా కొలువై ఉంటారు. ఇద్దరు మూర్తులు ఉండటం వల్ల ఏటా చిన వెంకన్నకు వైశాఖ మాసంలో, ప్రతిష్ఠ స్వామికి ఆశ్వయుజ మాసంలో తిరుకల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.



శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది(ఫైల్)

వార్షిక నికర ఆదాయ వివరాలివీ...

ఆదాయ వనరు	2022-22	2022-23	పెరిగిన ఆదాయం
హుండీలు	31,93,95,423	35,08,11,040	3,14,15,617
గదులు, సత్రాలు, కాటేజీల అద్దెలు	3,11,93,926	3,54,96,387	41,52,357
ప్రసాదాల విక్రయాల	16,59,06,713	17,73,55,982	1,23,13,629
దర్శనం, ఆర్జిత సేవలు	12,55,19,222	16,28,99,627	3,73,80,405
శుభకార్యాలు	84,30,129	1,40,74,667	56,44,538



ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారు

న్యూస్‌రీల్

బాబు ఇఫ్తార్ విందును బహిష్కరించండి



మాట్లాడుతున్న ఆరిఫ్

సాక్షి, రాజమహేంద్రవరం: తమ ప్రభుత్వ హయాంలో ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్ ఆరోపించారు. ఈనెల 11వ తేదీన(మంగళవారం) మంగళగిరిలో ముస్లింకు ఇస్తున్న ఇఫ్తార్ విందును ముస్లింలందరూ సామూహికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాబు అధికారంలో ఉన్న సమయంలో ముస్లింలకు తీరని ద్రోహం చేశారన్నారు. ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎన్నికలకు నాలుగు నెలల ముందు మాత్రం చివరి ఆరు నెలలకు ఫరూక్‌ను మంత్రిని చేశారని దుయ్యబట్టారు. గతంలో ముస్లింలను విస్మరించిన చంద్రబాబుకు ఇప్పుడు అమాంతం ప్రేమ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు.

ముందుగానే జగనన్న విద్యాకానుక కిట్లు



పెరవలి హైస్కూల్ ఆవరణలో జేవీకే డైరెక్టర్ మధుసూదనరావు

పెరవలి: ఏటా విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్లను వేసవి సెలవులకు ముందుగానే అన్ని మండలాలకూ చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర జగనన్న విద్యాకానుక డైరెక్టర్ (జేవీకె) డి.మధుసూదనరావు చెప్పారు. పెరవలి ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఎలుకల బెడద లేని, చెదలు పట్టని గదులను ముందుగానే ఎంపిక చేసి, వాటిలో జగనన్న విద్యాకానుక కిట్లను భద్రపరుస్తామన్నారు. సురక్షితమైన గదుల కోసం మండలాల వారీగా కొన్ని పాఠశాలల భవనాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఈ పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్.అబ్రహం, ఏఎంఓ గౌరీశంకర్, ఎంఈఓ డి. హైమావతి, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో ప్రొఫెసర్ ఎస్.టీకె, అనురాగ్ మిట్టల్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న 'వ్యవస్థాపన ద్వారా మహిళా సాధికారత' అనే అంశంపై జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కృష్ణ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నన్నయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.టీకె మాట్లాడుతూ వ్యవస్థాపకులుగా సమాజంలో రాణించాలంటే వ్యాపార మెళకువలతోపాటు అవగాహన, క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక కేంద్రం ఇన్‌చార్జ్ అనురాగ్ మిట్టల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. ప్రపంచీకరణ తర్వాత మహిళలు కూడా ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. జాతీయ మహిళా సాధికారత సమాఖ్య ఏపీ ఛాప్టర్ అధ్యక్షురాలు ఎ.లలిత మాట్లాడుతూ ప్రైవేటీకరణ ద్వారా మహిళలకు ఎన్నో వ్యాపార అవకాశాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సహాయ సహకారాలను జాతీయ మహిళా సాధికారత అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఏ.అన్నపూర్ణ, పీవీవీ.సత్యనారాయణ, కె.ఆంజనేయులు, డాక్టర్ బీపీ.నరసారెడ్డి, డాక్టర్ పి.షణ్ముఖరావు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ మాధవీలత
- కలెక్టరేట్‌లో 164 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను పూర్తిస్థాయిలో వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలసి ఆమె.. ప్రజల నుంచి 164 అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఈనెల 14వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వూరులో పర్యటించనున్న దృష్ట్యా అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వైద్యాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, తగినన్ని మందులు, బీపీ మిషన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ స్పందనలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి, పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వలంటీర్లకు వందనం : కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొవ్వూరులో ఈనెల 14న జరిగే వలంటీర్లకు వందనం రాష్ట్ర స్థాయి వేడుకలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని, దానికి శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సీఎం జగన్ పర్యటనపై జిల్లా, డివిజన్, మండలాల వారీగా ముందస్తు కార్యాచరణపై జేసీ ఎన్.తేజ్ భరత్, కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఆర్వో జి.నరసింహంతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 14న కొవ్వూరులో జరిగే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు సకాలంలో చేరవేయడంలో వలంటీర్ల పాత్ర ప్రధానమన్నారు. అటువంటి వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ఈ వేడుకలు నిర్వహించనున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న రోడ్‌షోకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో సీఎం బహిరంగ సభకు హాజరు కానున్న స్వయం సహాయక సంఘాలు, వలంటీర్లతో సమన్వయం సాధించడం ముఖ్యమన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం సిటీ): స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ సోమవారం సందర్శించారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లపై అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆయనకు వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచి నీరు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో మాట్లాడారు. పరీక్ష ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ పి.దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై నేడు శిక్షణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ): రబీ ధాన్యం కొనుగోలుపై క్షేత్ర స్థాయి సిబ్బందికి సాంకేతికపరమైన శిక్షణ ఇస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని సిబ్బందికి, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకూ కొవ్వూరు డివిజన్ పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి రబీ సేకరణపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల ప్రారంభం



ఏపీఎస్పీలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ప్రారంభించిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీ ఎస్పీ మూడో బెటాలియన్ క్యాంప్‌లో పలు నిర్మాణాలను ఇన్‌చార్జ్ కమాండెంట్, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఏపీ ఎస్పీలో నిర్మించిన పోర్టువాల్, సిబ్బంది విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన బల్లలు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. అనంతరం 2020–21 కోఆపరేటివ్ డివిడెంట్ ఫండ్ రూ.24,876ల చెక్కును గ్రీన్‌ఫీల్డ్ అంధుల పాఠశాల వార్డెన్ దక్షిణామూర్తికి అందజేశారు. అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అడిషనల్ డీసీపీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్ సత్యం, రవి, ఆర్ఐలు రఘుబాబు, సురేష్‌బాబు, రామకృష్ణ, దాసు, గణేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యంపై కేసులు

రాజమహేంద్రవరం సిటీ: నిఘా వర్గాల సమాచారంతో ఉమ్మడి జిల్లాలోని ప్రత్తిపాడు, కరప మండలాల్లో విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసినట్లు యాంటీపవర్ తెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రెండు మండలాల్లోని ఏలూరు, గొర్రిపూడి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించగా చేపలు, రొయ్యల చెరువులకు డైరెక్ట్ టాపింగ్, బైపాసింగ్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరిపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేశామన్నారు. ఇందులో ఒకరికి రూ.1,01,900 అపరాధ రుసుం, రూ.7 వేల జరిమానా, మరొకరికి రూ.1,93,539 అపరాధ రుసుం, రూ.20 వేల జరిమానా విధించామని వివరించారు. ఏంఆర్‌వీ రాజు, వైవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుకుందాం... రారండి

- బాలికా విద్యకు కేజీబీవీతో భరోసా
- 6 నుంచి ఇంటర్ వరకూ ఉచిత బోధన
- దరఖాస్తుల స్వీకరణకు 20 తుది గడువు

రాయవరం: పేద, అనాథ బాలికల విద్యకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) భరోసాగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా బోధన సాగిస్తున్న కేజీబీవీల్లో ప్రవేశాలకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. ఇక్కడ సాధారణ విద్యతో పాటు ఒకేషనల్, కంప్యూటర్ విద్యను సైతం అందిస్తున్నారు. ఆంగ్ల బోధనతో పాటు ఉచిత భోజనం, వసతి, పుస్తకాలు, యూనిఫామ్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. కాకినాడ జిల్లాలో నాలుగు కేజీబీవీల్లో ప్రవేశానికి అవకాశముంది. ఇందులో ఆరో తరగతిలో ప్రవేశానికి మార్చి 27 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 6వ తరగతికి 40 సీట్లు ఉన్నాయి.

విద్యాలయాలు.. కోర్సులు

జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు కింద మైదాన ప్రాంతాల్లో తుని, కోటనందూరు, శంఖవరం, తొండంగిలలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైదాన ప్రాంతంలోని నాలుగు కేజీబీవీలతో పాటు రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం, చింతూరులో ఉండేవి. జిల్లాల విభజన అనంతరం ఏజెన్సీ కేజీబీవీలు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఇప్పుడు కేవలం కాకినాడ జిల్లా పరిధిలో నాలుగు కేజీబీవీల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. ఇందులో ఏడాదికి 40 చొప్పున 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి సీట్లు కేటాయిస్తారు. జిల్లాలోని నాలుగు కేజీబీవీలో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టారు. శంఖవరం కేజీబీవీలో ఎంపీసీ, తుని కేజీబీవీలో బైపీసీ, తొండంగి కేజీబీవీలో హెచ్‌ఈసీ, కోటనందూరు కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులున్నాయి.



కస్తూర్బా గాంధీ విద్యాలయం

తేదీలు ఇలా..

దరఖాస్తుల ప్రారంభ తేదీ: మార్చి 27
స్వీకరణకు చివరి తేదీ: ఏప్రిల్ 20
ఎంపికైన విద్యార్థులకు ఇంటిమేషన్: ఏప్రిల్ 21 నుంచి 25 వరకు..
సర్టిఫికెట్ల పరిశీలన: ఏప్రిల్ 26 నుంచి 30 వరకు



కేజీబీవీ విద్యార్థినులు

తొలి ప్రాధాన్యం వీరికే.. : అనాథ వీధి బాలికలు, పేద పిల్లలతో పాటు బడిబయట పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యం కింద ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, కార్మిక శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికీ ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. 2018 నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్యనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫిమేల్ లిటరసీ రేటు తక్కువగా ఉన్న మండలాలకు చెందిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. మొదటి ప్రాధాన్యం కాకినాడ జిల్లాలోని ఫిమేల్ లిటరసీ తక్కువగా ఉన్న మండలాల విద్యార్థినులకు ఇస్తారు. సీట్లు భర్తీ కాకపోతే ఆ సీట్లను కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో విద్యార్థినులతో భర్తీ చేస్తారు.

గుణాత్మక విద్యాబోధన : కేజీబీవీల్లో బాలికలకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో గుణాత్మక విద్య అందిస్తున్నారు. వీటితో పాటు ఆంగ్ల మాధ్యమం కూడా బోధిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా బోధన సాగిస్తున్నారు. రెగ్యులర్ పాఠ్యాంశాలతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, కంప్యూటర్ విద్య, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. అలాగే కేజీబీవీల్లో విద్యార్థినులకు విద్యతో పాటు కుట్లు, అల్లికలు, టైలరింగ్‌లో తర్ఫీదు అందిస్తున్నారు. బొమ్మల తయారీ, పేపర్స్‌తో వివిధ రకాల నమూనాలు తయారు చేయడం నేర్పిస్తున్నారు. కబడ్డీ, టెన్నిస్, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, హాకీ, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో శిక్షణ అందిస్తున్నారు.

ఇది సువర్ణావకాశం



ప్రతి కేజీబీవీల్లో 6వ తరగతిలో ప్రవేశానికి నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల గడువు ముగియగానే పరిశీలన చేసి ప్రవేశాన్ని నిర్ణయిస్తాం. పేద విద్యార్థినులకు కేజీబీవీలో ప్రవేశం ఒక సువర్ణావకాశం. చదువు, ఆటపాటల్లో కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు. –జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశాలకు కల్పించే అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ తరహా విద్యను ఇక్కడ అందిస్తున్నారు. బాలికలకు భద్రతతో కూడిన విద్యాబోధన లభిస్తుంది. –కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ, కాకినాడ

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



కేజీబీవీల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులు ఉంటారు. రోజూ ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. ప్రతి విద్యార్థిని పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపిస్తారు. –పి.ఉమామహేశ్వరి, జీసీడీఓ, ఏపీ సమగ్ర శిక్షా, కాకినాడ

ఉద్యోగప్రాప్తిరస్తు

- 285 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు
- 1998 డీఎస్సీ అభ్యర్థులతో నియామకం
- రేపు కాకినాడలో ఇంటర్వ్యూలు

రాయవరం: రెండు దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ–1998 అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వారితో భర్తీ చేస్తుంది. దీనికి సంబంధించి గతేడాది సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ అర్హులు వారి అంగీకారాన్ని తెలుపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గతేడాది అక్టోబర్ 6 నుంచి 14వ తేదీ వరకూ పరిశీలించి సీనియారిటీ జాబితాను రూపొందించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు 486 మంది అంగీకరించారు.

ఎంత మందికి అవకాశమంటే..

ప్రభుత్వం ఇప్పటికే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలకు, హెచ్‌ఎంల నుంచి ఎంఈఓలకు పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన చేట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా సర్దుబాట్లు చేసింది. పదోన్నతులు, సర్దుబాట్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పడిన ఖాళీల్లో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను నియమిస్తుంది. ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను నియమించనున్నట్లు సమాచారం. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 285 మందికి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుంది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం నియామకం చేపట్టనున్న 285 మంది క్వాలిఫైడ్ అభ్యర్థుల జాబితాను డీఈవోఈజీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈ జాబితాలో అభ్యర్థులు మినిమమ్ టైమ్ స్కేల్ నందు నియామకం పొంది, 60 ఏళ్లలోపు ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పనిచేయడానికి అంగీకరించిన వారు హాల్ టికెట్, అంగీకార పత్రాలు, అర్హత ధ్రువపత్రాలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 12వ తేదీ బుధవారం కాకినాడ సమగ్ర శిక్ష సమావేశ హాలులో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలి.



1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు (ఫైల్)

ఏర్పాట్లు పూర్తి చేశాం

డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎంపికైన వారి జాబితా డీఈవోఈజీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. జాబితాలోని అభ్యర్థుల్లో, ఆసక్తి ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంది. ఇంటర్వ్యూలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. –కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ, కాకినాడ

సీఎం బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

పనులను పర్యవేక్షించిన జేసీ తేజ్‌భరత్

కొవ్వూరు: కొవ్వూరులో ఈ నెల 14న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన విచ్చేస్తున్నారు. ఈ పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ చకచకా చేస్తున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుద్ధుడు జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులు కొనసాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ ఈఈ ఐ.దేవేంద్రరాజు పర్యవేక్షణలో హెలిప్యాడ్ నిర్మాణం జరుగుతుంది. స్థానికంగా మంత్రి క్యాంపు కార్యాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో బహిరంగ సభా ప్రాంగణంలో లెవెలింగ్ పనులను జాయింట్ కలెక్టర్ కె.తేజ్‌భరత్ సోమవారం పరిశీలించారు. ఆదివారం రాత్రి నుంచి ఐదు పొక్లెయినర్లతో లెవెలింగ్ చేయిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఇతర అధికారులు సభా ప్రాంగణం వద్దే ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు. సభా వేదిక నిర్మాణ సామగ్రి అంతా కొవ్వూరుకు చేరుకుంది. వందలాది మంది కార్మికులు వేదిక నిర్మాణ పనుల్లో నిమగ్నం అయ్యారు. భారికేడ్లు, వేదిక నిర్మాణానికి సుమారు పది హేను లారీల్లో సామగ్రి వచ్చింది. వివిధ శాఖల అధికారులు సభా ప్రాంగణంలో వద్ద ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



కొవ్వూరులో బుద్ధుడు జంక్షన్ వద్ద ఖాళీ స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు పనులు



కొవ్వూరులో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదురుగా సభా ప్రాంగణంలో జేసీబీలతో చదును పనులు

నేరాల నియంత్రణలో ద్వితీయ స్థానం

తూర్పుగోదావరి జిల్లాకు గుర్తింపు

రాజమహేంద్రవరం రూరల్: సారా, గంజాయి తదితర నేరాల నియంత్రణలో 26 జిల్లాల్లో తూర్పుగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు అడిషనల్ డీజీపీ, రాష్ట్ర ఎస్ఈబీ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ చేతుల మీదుగా సోమవారం జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ తెలిపారు. ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ ఎం.రాంబాబు, ఇన్‌స్పెక్టర్స్, సబ్ ఇన్‌స్పెక్టర్స్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులను ప్రశంసించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల కాలంలో సారా విక్రయించే, రవాణా చేసే వారిపై అత్యధిక కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు. వాటిని ఉల్లంఘించిన వారి నుంచి రూ.64,52,000ను ప్రభుత్వానికి కట్టించామన్నారు. 33 మందిపై పీడీయాక్ట్ అమలు చేసి సారా నియంత్రణకు కృషి చేశామని అన్నారు. గత నెలలో సుమారు ఆరు గంజాయి కేసులను నమోదు చేసి 17 మంది ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. సారా ముడిసరుకు అయిన బెల్లం అమ్మేవారిపై 26 కేసులు నమోదు చేసి 27 మందిని అరెస్టు చేశామని వివరించారు. దీనికి గాను రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని సోమశేఖర్ తెలిపారు. సారా, గంజాయి అమ్మకాలు, రవాణాకు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబరు 14500కు తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు.



రవిశంకర్‌అయ్యర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సోమశేఖర్, రాంబాబు

నాలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో తిరుపతి మహతి ఆడిటోరియం వేదికగా శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో 48 గంటల పాటు సాహితీ, కళారంగాల్లో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సాహితీ రంగంలో అయినవిల్లి మండలం మాగాం గ్రామానికి చెందిన, చింతనలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వీధి దుర్గారావు కవితా గానం చేసి అమేజింగ్ వరల్డ్ ఆఫ్ రికార్డ్స్, మర్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నేషనల్ అసోసియేషన్ తెలుగు అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదు అయ్యారన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షుడు చేజర్ల ఇంద్రకుమార్రాజులు దుర్గారావు మాస్టారును దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. గతంలో దుర్గారావు మలికిపురంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల పాటు జరిగిన కవితాగానంలో పాల్గొని ప్రపంచ రికార్డులో తన పేరును నమోదు చేయించుకున్నారు.



వీధి దుర్గారావు సత్కరిస్తున్న నిర్వాహకులు

పిచ్చికుక్క స్వైర విహారం

25 మందిపై దాడి

జగ్గంపేట: జగ్గంపేటలో సోమవారం ఓ పిచ్చికుక్క హడలెత్తించింది.. అది 25 మందిపై దాడి చేయగా పదుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిన పరిస్థితి వచ్చింది. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట నుంచి ఓ పిచ్చికుక్క ప్రజలపై దాడి చేస్తూ జగ్గంపేట సెంటర్‌లో అండర్‌పాస్ బ్రిడ్జి కిందకు చేరుకుంది. అక్కడ ఎవరు కనబడితే వారిపై దాడి చేసింది. దీంతో రోడ్డుపై వెళ్లేవారు పరుగులు తీశారు. కొద్దిసేపటి తరువాత స్థానికులు ధైర్యం చేసి కర్రలతో కొట్టి చంపేశారు. మొత్తం 25 మంది బాధితులు జగ్గంపేట సీహెచ్‌సీకి వెళ్లారు. వారందరికీ రేబిస్ వ్యాక్సిన్ వేసి, ఇందులో తీవ్రంగా గాయపడిన 10 మందిని ప్రత్యేక చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. కుక్క దాడిలో గాయపడిన వారిని జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ పరామర్శించారు.



బాధితుడికి చికిత్స చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

క్రైం కార్నర్..

బాలికపై పాస్టర్ అకృత్యం..

- గర్భవతిని చేసిన వైనం
- పుట్టిన బిడ్డనూ మాయం చేసినట్లు బంధువుల ఫిర్యాదు

అంబాజీపేట: సమాజాన్ని సన్మార్గంలో నడిపించాల్సిన పాస్టరే దారితప్పాడని.. అభం శుభం తెలియని బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసి.. ఆనక పుట్టిన బిడ్డనూ మాయం చేశాడని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అమలాపురంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సోమవారం బాలిక బంధువులు, గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి వారు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. పుల్లేటికుర్రు శివారు చీకురుమిల్లివారి పేటకు చెందిన ఓ బాలిక స్థానిక పాస్టర్ హోసన్న నిర్వహించే చర్చిలో సభ్యురాలిగా ఉంటుంది. బాలికకు తల్లి లేకపోవడంతో తండ్రి సాయంతో చర్చి వద్ద పనులు చేస్తుంది. దీనిని హోసన్న ఆసరాగా తీసుకుని బాలికను లోబర్చుకుని గర్భవతిని చేశాడు. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి ఇద్దరు నర్సుల సాయంతో మందులు వాడించాడు. డెలివరీ సమయం వచ్చేసరికి ఆ బాలికను అమలాపురంలోని ఓ ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా, ఏమైందని హోసన్నను స్థానికులు ప్రశ్నించారు. ఆ బాలిక కడుపులో కణితి ఉందని, ఆపరేషన్ చేయించడానికి తీసుకు వెళుతున్నానని చెప్పాడు. గత నెల 5న హోసన్న పర్యవేక్షణలో అమలాపురంలోని ఆ ఆసుపత్రిలో బాలికకు ఆపరేషన్ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. మగబిడ్డ పుట్టిన కొన్ని నిమిషాలకే ఆ బిడ్డను కనిపించకుండా చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రసవం జరిగిన వారం రోజులకు ఆ బాలిక ఇంటికి వచ్చిన తర్వాత ప్రశ్నించడంతో విషయం బయటకు వచ్చిందన్నారు. పుట్టిన బిడ్డ కనిపించడం లేదని చైల్డ్‌యాక్ట్ వారికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అంగన్‌వాడీ టీచర్లు, పోలీసులు బాలిక ఇంటికి వచ్చి విచారించారు. బిడ్డను ఎవరికి ఇచ్చారో తెలపాలని బాలికను అడిగారు. ఈ సంఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా బిడ్డ ఆచూకీ లభించకపోవడంతో కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశామని బాలిక అక్క, బావ, బంధువులు, స్థానికులు తెలిపారు. ఆసుపత్రిలో జన్మించిన ఆ బిడ్డ ఏమయ్యాడు... అమ్మేశారా.. చంపేశారా అంటూ బంధువులు ఆరోపిస్తున్నారు. ఆ బాలికను నమ్మించి మోసగించిన హోసన్నపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి కుమారుడిపై అట్రాసిటీ కేసు

ఉప్పలగుప్తం: వానపల్లిపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ నల్లా వెంకటేశ్వరరావు కుమారుడు నల్లా నవీంద్ర ఓ దళిత యువకుడిపై దౌర్జన్యానికి దిగి చితకబాదిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కాట్రేనికోన మండలం పల్లం పంచాయతీ గోపాలరావుపేటకు చెందిన గుండారపు రాజు నాలుగేళ్లుగా నల్లా వెంకటేశ్వరరావు వద్ద మకాం కూలీగా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వరరావు కుమారుడైన నవీంద్ర కొంత కాలంగా పని విషయంలో ఇబ్బందులు పెడుతున్నాడని, శనివారం పని ముగించుకుని వచ్చినా ఆవేశంతో దౌర్జన్యానికి దిగి, కులం పేరుతో దుర్భాషలాడుతూ చెప్పులతో తన్నాడని తెలపటంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్ పార్శిల్ కార్యాలయం సమీపంలో మొదటి ప్లాట్‌ఫామ్‌పై ఓ గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతి చెంది పడిఉన్నాడని జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు సోమవారం తెలిపారు.

మృతుడి వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. నీలం రంగు చారల లుంగీ, లేత నీలం రంగు చారల పొడవు చేతుల చొక్కా, ఎరుపు ఆకుపచ్చ రంగు చారల టవల్ ధరించి ఉన్నాడన్నారు. మరిన్ని వివరాలకు జీఆర్పీ స్టేషన్ అధికారులు 94406 27551, 94914 44022 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

కాలువలో మహిళ మృతదేహం

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణ స్వామి ఆలయం వద్ద ఉన్న గోదావరి కాలువలో ఓ మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సంఘటనా స్థలానికి ఎస్సై టి.సునీత చేరుకుని వివరాలు సేకరించారు. గోదావరి కాలువలో స్నానానికి దిగిన సమయంలో జారిపడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతిరాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతిరాలి కుడిచేతిపై ఓంకారం పచ్చబొట్టు ఉందని, వివరాల కోసం సామర్లకోట పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్లు 94407 96568, 97016 26505లలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.



గుర్తుతెలియని మహిళ మృతదేహం